

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల ఆందోళన

హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక లోపం



శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి తిరుపతికి వెళ్లాల్సిన 9ఐ 877 అలయన్స్ ఎయిర్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో గంటల తరబడి ఎయిర్‌పోర్టులోనే ప్రయాణికుల పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఎయిర్‌లైన్స్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఎయిర్ పోర్టు వర్గాల కథనం మేరకు... బుధవారం ఉదయం 5.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి తిరుపతి బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న అలయన్స్ విమానంలో టెక్నికల్ సమస్య వచ్చినట్టు పైలెట్లు సిబ్బందికి సూచించారు. దీంతో ఆరు గంటలకు పైగా ప్రయాణికులు ఎయిర్‌పోర్టులోనే వేచి ఉండాల్సి వచ్చింది. ఎయిర్‌లైన్స్ సిబ్బంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోపోద్రిక్తమైన ప్రయాణికులు అలయన్స్ టికెట్ కౌంటర్ వద్ద ఆందోళనకు దిగారు. ఎయిర్‌లైన్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇతర విమానాల ద్వారా ప్రయాణికులను పంపించాలని డిమాండ్ చేశారు. ఆరు గంటల తరువాత సిబ్బంది వచ్చి విమానాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. అదేదో అప్పుడే చేస్తే బాగుండేది కదా అని ప్రయాణికులు మండిపడ్డారు ప్రయాణికులకు టికెట్ డబ్బులు వాపస్ ఇచ్చినట్టు తెలిసింది. చాలామంది ప్రయాణికులు వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్తున్నట్టు చెప్పారు. విమానం రద్దు కావడంతో మరోరోజు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ఎన్నికల్లో బీసీల గెలుపు శాతాలు (జిల్లాల వారీగా)

	రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
పంచాయతీలు	35	40	36
ఎంపీటీసీలు	41.1	37	27
జెడ్పీటీసీలు	33.33	22	20



'స్థానికం'లో బీసీ చైతన్యం

బీసీ జనాభా లెక్కలు తేలడంతో రిజర్వేషన్ల అమలుపై ఆ వర్గాల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ఇటీవల జరిగిన కులగణనకు సంబంధించి సర్వే నివేదికను మంగళవారం ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీంతో వచ్చే స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని లేనిపక్షంలో కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. 2019లో జరిగిన స్థానిక ఎన్నికల్లో బీసీలు రిజర్వుడు స్థానాలకు మించి సీట్లు దక్కించుకున్నారు. రాజకీయ చైతన్యంతో అనేక జనరల్ స్థానాల్లో పోటీ చేసి ఉన్నతవర్గాలను ఢీకొట్టారు. ప్రధానంగా పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటారు. కొన్ని మండలాల్లో రిజర్వేషన్లకు మించి రెట్టింపు స్థాయిలో పంచాయతీలను కైవసం చేసుకోవడం గమనార్హం. అయితే జనాభా శాతం ఉన్న స్థాయిలో సీట్లు సంపాదించలేకపోతున్నారు.

జనరల్ స్థానాల్లోనూ గట్టిపోటీ

- గత ఎన్నికల్లో రిజర్వ్‌డ్ సీట్లకు మించి గెలుపు
- పంచాయతీల్లోనూ కొనసాగిన హవా
- గతంలో 22 శాతంలోపే రిజర్వేషన్లు అమలు
- 42శాతం అమలుకు బీసీ సంఘాల డిమాండ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): బీసీ రిజర్వేషన్ల కోటాను చట్టబద్ధంగా పెంచేందుకు అనేక చిక్కుముడులు ఉండడంతో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ విషయంపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'బీసీ రిజర్వేషన్ల పెంపు జరగాలంటే రాజ్యాంగ సవరణ జరగాలి.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ 42శాతం సీట్లు బీసీలకు ఇస్తామని' ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో అసలు స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం ఎంత? అని పరిశీలిస్తే గడిచిన నాలుగు దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో

మిగతా 7వ పేజీలో...

2019 స్థానిక ఎన్నికల్లో బీసీల గెలుపు వివరాలు

	రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
పంచాయతీలు	558	565	61
బీసీ రిజర్వ్‌డ్	124	159	16
మొత్తం గెలిచినవి	195	226	22
ఎంపీటీసీలు	267	221	41
బీసీ రిజర్వ్‌డ్	74	53	11
మొత్తం గెలిచినవి	110	82	15
జెడ్పీటీసీ స్థానాలు	21	18	05
బీసీ రిజర్వ్‌డ్	04	03	01
మొత్తం గెలిచినవి	07	04	01



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

దమ్మున్న సీఎం రేవంత్

- ప్రతీ హామీని నెరవేర్చడంలో సఫలం
- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఏ రాష్ట్రంలో చేయని విధంగా తెలంగాణలో కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులను అసెంబ్లీలో ప్రవేశ పెట్టి ఆమోదింపజేసిన దమ్మున్న సీఎం రేవంత్‌రెడ్డి అని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లోని భీం భరత్ నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్లుగా ఎస్సీ ఉద్యమాలు చేసిన మాదిగలకు ఇది ఓ చరిత్రాత్మకమైన రోజని అన్నారు. అలాగే బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ప్రకటించడం కూడా గొప్ప విషయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా తరఫున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ రెండు అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం అజీజ్‌నగర్ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, మండల అధ్యక్షుడు మానయ్య, కంజర్ల భాస్కర్, మర్రి రవీందర్‌రెడ్డి, బొలిగిద్ద సత్యనారాయణ, శ్రీరాం నగర్ జంగారెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో ప్రభుత్వంగా పూర్తిగా విఫలమైందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 39మందికి కల్యాణలక్ష్మి, నలుగురికి షాదీముబారక్‌కు సంబంధించిన చెక్కులను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి తోపాటు తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ నాయకుల హామీ ఏమైందని ప్రశ్నించారు. జనవరి 26న రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చలేదన్నారు. చెక్కుల పంపిణీ అనంతరం కులగణన సర్వేకు సంబంధించిన నివేదికలను చూపాలని ఎమ్మెల్యే అధికారులను అడిగారు. అవి మా వద్ద లేవని చెప్పడంతో ఆమె విస్మయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, డైరెక్టరు పొట్టి ఆనంద్, తహసీల్దార్ కె.గోపాల్, ఎంపీడీవో సరిత, ఎస్.సురేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఇందిరదేవేందర్, రాములు పాల్గొన్నారు.



యాచారం మండలం చింతుల్ల గ్రామంలో రైతు జంగయ్యతో మాట్లాడుతున్న యుగేందర్‌రెడ్డి

అనుమతి లేకుండా బోరు వేస్తే కఠిన చర్యలు

భూగర్భ జల వనరుల శాఖ జిల్లా అధికారి మాధవరావు



రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా బోరు వేస్తే బోరు యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుందని జిల్లా భూగర్భ జలవనరుల శాఖ అధికారి మాధవరావు అన్నారు. 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో 'వాల్టా.. పల్టా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తే సహించేది లేదన్నారు. భూగర్భజల శాఖ హైడ్రో జియోలజిస్టు యుగేందర్‌రెడ్డి బుధవారం యాచారం మండలం చింతుల్ల గ్రామంలో రైతు జంగయ్యను కలిసి బోరు వేసిన తీరును పరిశీలించారు. పంటలు ఎండుతున్నాయని కొత్తగా బోరు వేయొద్దని రైతుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాధవరావు ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు. జిల్లాలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడటం జరిగిందని తెలిపారు. బోరు వేయాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. తాగునీటి కోసమైతే ముందుగా అధికారులను సంప్రదించి తర్వాత బోరు వేసుకోవాలన్నారు. జిల్లాలోని బోర్‌వెల్స్ యజమానులు రిగ్గింగ్‌కు అనుమతులు తీసుకోవాలని తెలిపారు. త్వరలో వారితో సమావేశాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 48 మంది పర్మిషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు చెప్పారు. వాటర్ ప్లాంట్ యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఇప్పటి వరకు 18 వాటర్ ప్లాంట్స్‌ను పరిశీలించగా నాణ్యతా ప్రమాణాలు లేవన్నారు. ముందస్తుగా వాటి యజమానులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. బోరు అనుమతికి దరఖాస్తు చేసుకుంటే రిసిస్టివిటీ మీటర్ ద్వారా అధికారులు వచ్చి భూగర్భ జలాలు ఎంత లోతులో ఉన్నాయి.. నీరు వస్తుందా లేదా అనే విషయాలని పరిశీలిస్తారని వివరించారు.



నేడు జాబ్‌మేళా

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 6న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో రిటైల్, ఈకామర్స్, బ్యాకింగ్, బీపీవో రంగాల్లో పోస్టులు ఉన్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ అండ్ డిప్లోమా పూర్తి చేసి ఉండాలి. వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల గురువారం ఉదయం 10.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మల్లేపల్లిలోని శాంతి నగర్ ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాల కోసం 9963493453, 9063099306 నెంబర్లను సంప్రదించాలని ఆమె తెలిపారు.

అందని గౌరవం

నాలుగు నెలలుగా వేతనాల్లేవ్

- అవస్థల్లో రేషన్ డీలర్లు
- భారంగా దుకాణ నిర్వహణ
- కమీషన్ పెంచాలని వేడుకోలు
- ప్రభుత్వం ఎన్నికల హామీని నెలబెట్టుకోవాలని విన్నపం
- ప్రస్తుతం క్వింటాల్‌కు రూ. 140 మాత్రమే
- రూ. 300 నుంచి 400 ఇవ్వాలని డిమాండ్



యాచారం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అందించే గౌరవ వేతనం అందక జిల్లాలోని రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చే కొద్దిపాటి కమీషన్ కూడా మూడు నాలుగు నెలల పాటు పెండింగ్‌లో ఉండటం కుటుంబ పోషణ భారంగా మారుతుందని వాపోతున్నారు. సర్కార్ అందించే కమీషన్ సరిపోక రేషన్ దుకాణం నిర్వహణ కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమీషన్ పెంచాలని గత ఐదారేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు డీలర్లు విన్నవించినా ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు. ఏళ్లతరబడి సమస్యలతో సతమతమవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. నెల రోజులపాటు కష్టపడి బియ్యం పంపిణీ చేస్తే చివరకు గోనె సంచులే మిగులుతున్నాయన్నారు. ప్రస్తుతం క్వింటాల్ బియ్యానికి రూ.140 కమీషన్ మాత్రమే ప్రభుత్వం ఇస్తుందని, అది ఏమాత్రం సరిపోవడం లేదని రేషన్ డీలర్లు వివరిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే డీలర్లుకు కమీషన్ రూ.300 నుంచి రూ.400కు పెంచుతామని

మిగతా 8వ పేజీలో...

కమీషన్ పెంచి ఆదుకోవాలి



మాకు క్వింటాల్ బియ్యానికి రూ.400 కమిషన్ ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి. ఇంటి కిరాయి, లారీ అన్‌లోడింగ్‌కు అప్పు చేయాల్సి వస్తుంది. కమీషన్ పెంచకపోతే రేషన్ దుకాణం నిర్వహణ కష్టమవుతుంది. మా శ్రమను అధికారులు గుర్తించాలి. కనీసం గోనెసంచులు అమ్మినా హమాలీ డబ్బు కూడా చేతికందడం లేదు.

- యాదయ్య, రేషన్ డీలర్, మేడిపల్లి

పరిహారం తేల్చాకే సర్వే చేయాలి

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వే పనులను అడ్డుకున్న కొంగరకలాన్, ఫిరోజ్‌గూడ రైతులు



కొంగరకలాన్‌లో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేస్తున్న అధికారులు

ఆదిబట్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొంగరకలాన్, ఫిరోజ్‌గూడలలో బుధవారం గ్రీన్ ఫీల్డ్ రోడ్డు సర్వే పనులను రైతులు అడ్డుకున్నారు. భూసేకరణ పరిహారం తేల్చాకే సర్వే చేపట్టాలని అధికారులకు తేల్చి చెప్పారు. ఇప్పటికే కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్, కేన్స్ కంపెనీలకు భూములు కోల్పోయామని, ఆ పరిహారం నేటికీ రాలేదని అధికారులపై మండిపడ్డారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డులో ఉన్న ఎకరం, రెండెకరాలు కూడా లాక్కుంటే రోడ్డున పడతామని, ప్రభుత్వం ఆలోచించి మార్కెట్ విలువకు మూడింతల ధర చెల్లించాలని అధికారులను కోరారు. బుధవారం ఓఆర్ఆర్ రావిర్యాల ఎగ్జిట్ 13 నుంచి కలెక్టరేట్ మీదుగా వెళ్తున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వే పనులను భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు ఆధ్వర్యంలో చేపట్టారు. ఇబ్రహీంపట్నం రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన, ఎక్సైజ్, ఆర్ అండ్‌బీ, పోలీసు అధికారులు సమన్వయంతో కొంగరకలాన్, ఫిరోజ్‌గూడలలో రెండో దఫా సర్వే చేశారు. ఈ ప్రాంతాల్లో 283, 296, 297, 298 సర్వే నంబర్లలో భూములు కోల్పోతున్న రైతుల పూర్తి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో భూసేకరణ డీటీ విజయ్‌కుమార్, ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పుష్పలత, సర్వేయర్లు ఖుర్షీద్, సాయి కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులతో కలిసి డప్పు కొడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 5: అట్టడుగు స్థాయిలో ఉన్న ఎస్సీ, బీసీల అభ్యున్నతిని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం కోసం కృషి చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ తన క్యాంపు కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్, బీసీ సెల్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వేర్వేరుగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఎస్సీ ఉప కులాలకు న్యాయం చేయడానికి ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏళ్ల క్రితం మంద కృష్ణ మాదిగ చేపట్టిన ఉద్యమానికి స్పందించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అనుసరిస్తూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కేబినెట్ ఆమోదించడం గొప్ప విషయమని తెలిపారు. సుప్రీం ఆదేశాలకనుగుణంగా ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి ఎస్సీలలోని 59 ఉప కులాలకు న్యాయం జరిగేలా ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీగా విభజించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కుల గణనను చేపట్టి, జాబితాను విడుదల చేసిందని అన్నారు. కుల గణనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం సీట్లు ఇవ్వనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. ఎస్సీ, బీసీలను పట్టించుకోని బీఆర్ఎస్ పార్టీ.. ఇప్పుడు కపట ప్రేమను చూపిస్తే ఏ ఒక్కరూ నమ్మబోరని అన్నారు. సమావేశంలో వై.యాదయ్య యాదవ్, గుండ్రాతి బాల్‌రాజ్‌గౌడ్, చంద్రశేఖర్, కరుణాకర్, నలమోని శ్రీధర్, రాయికల్ శ్రీనివాస్, బాదేపల్లి సిద్ధార్థ, కృష్ణ, జగన్, నాగి సాయిలు, భాస్కర్, రవి, నరేందర్, అంతయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

- ఆక్రమణదారుల చెర నుంచి భూదాన్ భూమిని కాపాడండి
- మూడో రోజూ రైతుల ఆందోళన
- మద్దతు తెలిపిన బీజేపీ నాయకులు, న్యాయవాదులు



నందిగామలో ఆందోళన చేస్తున్న భూదాన్ బాధిత రైతులు

నందిగామ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మా భూములను మాకు ఇప్పించండి అంటూ 1975లో భూదాన్ భూమి పట్టాపొందిన రైతులు ఆందోళనకు దిగారు. నందిగామ మండలకేంద్రం లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మూడో రోజైన బుధవారం కూడా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భూమి కోసం, భుక్తికోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం నాడు ఆచార్య వినోబాభావే భూదానోద్యమాన్ని ప్రారంభించి పేద లకు భూదాన్ భూములు ఇచ్చేలా ఉద్యమం చేశారని రైతులు తెలిపారు. తమకు భూదాన్ బోర్డు కింద అందించిన భూములను కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేశారని ఆరోపిస్తున్నారు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆందోళనకు బీజేపీ నాయకులు, న్యాయవాదులు మద్దతు తెలిపారు. రైతులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేపల్లి అశోక్ గౌడ్, లక్ష్మణ్, చెన్నయ్య, మల్లేష్, ప్రవీణ్‌గౌడ్, హేమంత్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీకాంత్, చిన్నా న్యాయవాదులు అంజు యాదవ్, సంగమేశ్వర్ రైతులు శ్రీను, వెంకటయ్య, బొంగుపల్లి జంగయ్య, పోచయ్య, యాదమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో ఎదుట జాతీయ రహదారిపై ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ నాయకులు ఎంపీ నరేష్, నర్సింగ్ రావు, రమేష్, నర్సింహులు, ఎండీ అలీం, ఖాజ, దేవేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి డప్పు కొడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

దరువేసిన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈనెల 7న హైదరాబాద్‌లో జరగనున్న వేల గొంతుల లక్ష డప్పుల ప్రదర్శన కార్యక్రమం వాయిదా వేసినప్పటికీ బుధవారం కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు అంబేడ్కర్, పూలే, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అయితే ర్యాలీలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య డప్పు కొట్టి దరువు వేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నేతలు విమర్శలు మానుకోవాలి

చిత్తశుద్ధి ఉంటే గ్యారెంటీలు అమలు చేయండి

బీజేపీ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి



కొత్తూర్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కొత్తూర్, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న విమర్శలు మానుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీజేపీ స్థానిక అధ్యక్షుడు అత్తాపురం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రాష్ట్రాలకు సమానంగా పంచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బావండ్ల మాణిక్యం, ప్రతాప్‌రెడ్డి, మోహన్‌సింగ్, ఇస్నాతి శ్రీనివాస్, హరికృష్ణ, బాల్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మధుసూదన్, పోచయ్య, రాఘవేందర్‌గుప్తా, శివకుమార్, జంగయ్య, మురళీ, శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్

నందిగామ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ అన్నారు. బుధవారం నందిగామ మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు అరవింద్ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బడ్జెట్‌లో మధ్య తరగతి కుటుంబాలకు ఊరట కలిగిస్తూ వార్షిక ఆదాయం రూ. 12.75 లక్షలకు పెంచడం, వ్యవసాయానికి రూ. 1.45 లక్షల కోట్లు, ముద్ర లోన్‌ల పెంపుతో పాటు ఇతర అన్ని రంగాలకు బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు దేపల్లి అశోక్ గౌడ్, లక్ష్మణ్, చెన్నయ్య, మల్లేష్ ప్రవీణ్‌గౌడ్, హేమంత్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీకాంత్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తే సహించం

ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు జయచంద్ర



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అనేక సంవత్సరాల పాటు పోరాడి ప్రాణాలు పణంగా పెట్టి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు కల్లూరి జయచంద్ర విమర్శించారు. బుధవారం దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా వివిధ కార్మిక సంఘాల నేతలు ఘట్‌కేసర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నందుననే కార్మికలోకం ఆందోళన చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని నిరసనలు తెలుపుతుంటే స్పందించక పోగా రైతులపై ఉక్కుపాదం మోపుతుందన్నారు. అనేక మంది అన్నదాతల ప్రాణాలను పొట్టనబెట్టుకుందని అన్నారు. రానున్న రోజుల్లో కార్మికులు, కర్షకులు ప్రత్యక్ష పోరాటాలకు సన్నద్ధమవుతున్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాంచందర్, మురళి, సువర్ణ, అండాలు, అరుణ, జంగమ్మ, సబిత, రాంకుమార్, కృష్ణ, ధర్మేంద్ర, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రాకు యాత్రికులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఉమ్రా యాత్రకు యాత్రికులు బయలుదేరి వెళ్లారు. బుధవారం ఆల్‌మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో 50 మంది యాత్రికులు వెళ్లారు. ఎయిర్‌పోర్టులో వారికి కుటుంబ సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ ప్రతి ముస్లిం సోదరి, సోదరీమణులు జీవితంలో ఒక్కసారైన ఉమ్రా యాత్ర చేయాలని సూచించారు. ఈ యాత్ర 15 రోజుల పాటు మక్కా, మదీనాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తామన్నారు. రెండో యాత్ర ఈ నెల 17న ఉంటోందని తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



ఎయిర్‌పోర్టులో యాత్రికులకు వీడ్కోలు పలుకుతున్న కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న పానుగంటి పర్వతాలు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

» ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక కోడల్‌లతో పాటు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని, అధిక ధరలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, నాయకులు యాదగిరి, నర్సింహ్మా, దత్తు నాయక్, చందు, మల్లేష్, వి. సత్యనారాయణ, నర్సింహ్మారెడ్డి, హరిసింగ్ నాయక్, డి.ప్రసాద్, కేతరాజు, రాములుగౌడ్, పి. యాదయ్య, జె.అంజయ్య, ఎస్.లక్ష్మయ్య, కె. లక్ష్మి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు చంద్రయ్య

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

కొడంగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య అన్నారు. బుధవారం కొడంగల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని ఆరోపించారు. కష్ట జీవులు, పేద ప్రజలకు వ్యతిరేకంగా బడ్జెట్ ఉందన్నారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణకు పెద్ద పీట వేయాలని చూస్తుందని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మైసప్ప, అనంతయ్య, మంగమ్మ, వెంకటమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

జిల్లా నూతన అధ్యక్షుడిని కలిసిన నేతలు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మేడ్చల్ మల్కాజ్గిరి రూరల్ జిల్లా నూతన అధ్యక్ష పదవి చేపట్టిన శ్రీనివాస్‌ను బుధవారం మేడ్చల్ నాయకులు మర్యాద పూరకంగా కలిశారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షురాలు జె.శైలజ హరినాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్ ఆధ్వర్యంలో ఉమ్మడి మేడ్చల్ మండలానికి చెందిన నాయకులు కలిశారు. కార్యక్రమంలో నాయకులు జాకట ప్రేమ్ దాస్, వంశి విజై, లవంగ శ్రీకాంత్, శ్రీశైలయం దావ్, రాగం అర్జున్, వంశీరెడ్డి మైసరి రాజు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

కందుకూరు,ఫిబ్రవరి 5,(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో తహసీల్దారు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఆయ గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాల్లో ఓటర్ లిస్టులు తయారు చేసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి గుర్తింపు కార్డులు, శిక్షణ తరగతులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు గోపాల్, సైదులు, నాగార్జున, కేఎల్ఎన్ ఆధిత్య, లలిత, ఎంపీడీవోలు సరిత, ఎంపీవో గీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో బాల్‌రాజ్

మహిళా సంఘాలు బలోపేతం కావాలి

కందుకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ బాల్‌రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కవిత అధ్యక్షతన నిర్వహించిన సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్, న్యూ ఎంటర్‌ప్రైజెస్‌కు రుణాలు మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం నేదునూరు కెనరా బ్యాంకు మేనేజర్ రాధాకృష్ణ మాట్లాడుతూ తమ బ్రాంచ్ నుంచి సీఎస్ఆర్ రూ.76,500 విలువగల ప్రొజెక్టర్‌ను మండల సమాఖ్యకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం కవి, ఏజీఎం అక్షయకుమారి, సీసీలు యాదయ్య, శ్రీహరి, శ్రీలత, ధనలక్ష్మి, హైమావతి, చంద రాజేశ్వరి, మల్లేష్ పాల్గొన్నారు.

ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

» ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎల్బీనగర్ సితార హోటల్ సెల్లార్ తవ్వకాల్లో ముగ్గురు కార్మికులు మృతి చెందడం బాధాకరమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. మృతి చెందిన ఒక్కో కార్మిక కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ యాజమాన్యాలు కార్మికుల సంక్షేమ చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఘటనకు జిల్లా జేసీఎల్, డీసీఎల్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రమాదానికి కారుకులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

‘స్థానికం’లో బీసీ చైతన్యం

(ఐదో పేజీ తరువాయి)

బీసీలు రాజకీయంగా కొంత చైతన్యం సాధించారు. గతంలో టీడీపీ హయంలో బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో బీసీ నాయకత్వం రాజకీయంగా ఎదిగింది. మాజీ హోంమంత్రి దేవేందర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ తదితర బీసీ నేతలు స్థానిక సంస్థల్లో దక్కిన అవకాశాలను అందిపుచ్చుకుని రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదిగారు. బీసీలకు అధికారికంగా రిజర్వేషన్లు పెంచితే ఉమ్మడి జిల్లాలో బీసీ నేతలకు మరిన్ని రాజకీయ అవకాశాలు దక్కుతాయి.

గత 2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 22శాతం లోపుగానే రిజర్వేషన్లు అమలు చేశారు. వారికి చట్టపరంగా దక్కాల్సిన అవకాశాలు దక్కనప్పటికీ సామాజిక బలంతో జనరల్ స్థానాల్లో పోటీ చేసి అనేక చోట్ల గెలుపొందారు. రంగారెడ్డి జిల్లాలోని పంచాయతీల్లో దాదాపు 35శాతం, ఎంపీటీసీ స్థానాల్లో 41.1 శాతం, జెడ్పీటీసీ స్థానాల్లో 33.33 శాతం బీసీలు గెలుపొందారు. అలాగే వికారాబాద్ జిల్లాలో పంచాయతీల్లో దాదాపు 40శాతం, ఎంపీటీసీ స్థానాల్లో 37 శాతం, జెడ్పీటీసీ స్థానాల్లో 22 శాతం బీసీలు గెలుపొందారు. మేడ్చల్ జిల్లాలో పంచాయతీల్లో దాదాపు 36శాతం, ఎంపీటీసీ స్థానాల్లో 27 శాతం గెలుపొందారు. ఇక్కడ బీసీలకు కేటాయించిన ఒక్క జెడ్పీటీసీ స్థానంలో మాత్రమే గెలుపొందారు.

బీసీ రిజర్వేషన్ల నేపథ్యం ఇలా..

1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తొలిసారిగా బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో 20శాతం బీసీలకు రిజర్వేషన్లు కేటాయించారు. తర్వాత బీసీ సంఘాలు దీనిపై ఉద్యమించడంతో 1993లో అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చారు. అయితే సుప్రీం కోర్టు మొత్తం రిజర్వేషన్లు 50శాతం దాటకూడదని పరిమితి విధించడంతో 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 22శాతానికి కుదించి ఎన్నికలు నిర్వహించింది. దీంతో 2019 నుంచి ఉమ్మడి జిల్లాలో ఎదుగుతున్న బీసీ నాయకత్వానికి కొంత బ్రేక్ పడింది. బీసీలకు స్థానిక సంస్థల్లో రాజకీయ అవకాశాలు తగ్గిపోయాయి. మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రస్తుత విధానం వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందని స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అధికారం పగ్గాలు చేపట్టిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా కులగణన సర్వే చేపట్టింది. ఈ నివేదికను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. అయితే సుప్రీం కోర్టు ఆదేశాలపై ఏం చేయాలనే దానిపై ఇంకా తర్జనభర్జనలు పడుతూనే ఉంది. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ నుంచి బీసీలకు 42శాతం సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

మరిది హత్యకు వదిన సుపారి

24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

» నలుగురు నిందితులకు రిమాండ్

» ఇంటి స్థలం, పాత కక్షల నేపథ్యంలో దారుణం

» తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

బషీరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నవాల్గ గ్రామశివారులో జరిగిన హత్య కేసును పోలీసులు 24 గంటల వ్యవధిలో ఛేదించారు. ఇంటి స్థలం, పాత కక్షల నేపథ్యంలో మరిదిని వదిన దారుణంగా హత్య చేయించిందని నిర్ధారించారు. ఈ మేరకు బుధవారం రాత్రి తాండూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి వివరాలు వెల్లడించారు.

నవాల్గకు చెందిన మాల శామప్ప(31)కు తన సొంత అన్న నర్సింహులు, వదిన సుగుణమ్మతో ఇంటి స్థలం విషయంలో కొంతకాలంగా తరుచూ గొడవలు జరిగుతుండేవి. పలుమార్లు గ్రామ పెద్దలు పంచాయితీ చేసినా గానీ కక్షలు పెరిగాయి తప్ప తగ్గలేదు. దీంతో వదిన ఎలాగైనా మరిదిని అడ్డు తొలగించుకుంటే సమస్య తీరిపోతుందని భావించింది. అనుకున్నట్లుగానే అతడి హత్యకు ప్లాన్ వేసింది. స్థానికంగా ఉంటున్న యువకులైన మాల శివకుమార్, కొత్త విజయకాంత్, విశ్వనాథ్‌లతో రూ. 50 వేలకు సుపారి మాట్లాడింది. ముందస్తుగా రూ.10 వేలు ఇచ్చింది. అయితే సోమవారం రాత్రి ఈ ముగ్గురు.. శామప్పను ప్లాన్ ప్రకారం మద్యం తాగుదామని గ్రామ శివారులోని రాథోడ్‌మోహన్ పొలానికి తీసుకెళ్లారు. శామప్ప మందు తాగుతున్న క్రమంలో ముఖంపై ముగ్గురు పడిగుద్దుల వర్షం కురిపించారు. ఆపై వెంట తెచ్చిన కండువాను మెడకు చుట్టి గొంతు నులిమి హత్య చేశారు. ఆతర్వాత రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశారు. కుదరకపోవడంతో మృతదేహాన్ని వదిలివెళ్లిపోయారు. మంగళవారం ఉదయం డేడ్‌బాడీని స్థానికులు గమనించి అతని తల్లి, చెల్లెలికి తెలిపారు. ఆపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ శంకర్, క్రైమ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమదైన శైలిలో విచారించి 24 గంటలలోనే కేసును ఛేదించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు సుగుణమ్మ పోలీసులు బుధవారం సాయంత్రం తాండూరు కోర్టులో హాజరుపర్చారు. ముగ్గురు యువకులను పరిగికి, మహిళను చర్లపల్లి జైలుకు మెజిస్ట్రేట్ రిమాండ్‌కు పంపించారని డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ నగేష్, బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్, క్రైం పోలీసులను డీఎస్పీ అభినందిస్తూ నగదు రివార్డును అందజేశారు.



విలేకరుల ఎదుట నిందితులను ప్రవేశపెట్టిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కమిటీ సభ్యులు

నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

» ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

కీసర, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్య అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ (జేహెచ్ఈఎస్) కార్యాలయంలో జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో జూబ్లీహిల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ మేనేజింగ్ కమిటీ గౌరవ సభ్యులుగా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, విల్లామేరీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ జాయింట్ సెక్రటరీగా చదలవాడ శ్రీనివాస్‌రావులను ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షుడు ఏ. మురళి ముకుంద్, ఉపాధ్యక్షుడు ఆర్. బాలమురళీ కృష్ణ, కార్యదర్శి ఎ. దినకర్ బాబు(ఐఏఎస్) రిటైర్డ్ వీరిద్దరిని కమిటీలోకి ఆహ్వానించారు.

మొరాయించిన సర్వర్

» నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

» రెండు రోజులుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల పడిగాపులు



పెద్దేముల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తహసీలార్ కార్యాలయంలో రెండు రోజులుగా ధరణి సర్వర్ మొరాయించడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. కూలి పనులు వదులుకొని సైతం పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు జోరుగా వరినాట్లు సాగుతున్నాయి. పనులు ముందుకు సాగకపోవడంతో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. పెద్దేముల్ మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు రెండురోజులుగా మార్టిగేజ్ కోసం తిరుగుతున్నారు. కొందరు తాతల పేరిట ఉన్న ఆస్తిని వారి పేరిట చేయించుకునేందుకు విరాసత్ పెట్టుకున్నారు. భూముల క్రయవిక్రయాలు జరిపిన కొందరు రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్లు బుక్ చేసుకున్నారు. కానీ ధరణి సర్వర్ రెండు రోజులుగా మొరాయించింది. సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్లు, విరాసత్, మార్టిగేజ్‌వంటి పనులన్నీ నిలిచిపోయాయి. వాటి కోసం పనులు వదులుకుని కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు పడిగాపులు కాస్తున్నారు. అధికారులేమో సర్వర్ పనిచేయనప్పుడు ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. సుదూర ప్రాంతాలవారు రెండురోజులుగా రవాణా ఖర్చులు భరిస్తున్నారు. చేసేది లేక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇంకో వైపు పెద్దేముల్ మండలంలో వరినాట్లు జోరుగా సాగుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సర్వర్ మొరాయించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీధి వ్యాపారులకు మరింత దన్ను

» పీఎం స్వానిధి పెంపు

» రూ. 30వేల పరిమితితో యూపీఐ క్రెడిట్ కార్డులు

» 7,486 మందికి లబ్ధి



తాండూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారులకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చింది. దీంతో వారికి మరింత సహాయం పెరగనుంది. వీధి వ్యాపారుల చిరు వ్యాపారానికి చేయూతనందించి ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంది. రెండు రకాలుగా వీధి వ్యాపారులకు లబ్ధి చేకూరనుంది. గతంలో పీఎం స్వా నిధి పథకం ద్వారా పట్టణాల్లోని వీధి వ్యాపారులకు తొలి విడతలో రూ. 10 వేలు వడ్డీ లేని రుణం అందించింది. రెండవ ఏడాది రూ. 20 వేలకు పెంచింది. తాజాగా ప్రస్తుతం బడ్జెట్‌లో రుణ సహాయాన్ని రూ. 30వేలకు పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి ప్రకటించారు. దీంతో మరింత వ్యాపార అభివృద్ధి సాధించవచ్చు. లోన్‌లతో పాటు రూ. 30 వేల పరిమితితో యూపీఐ లింకుడ్ క్రెడిట్ కార్డులను పొందొచ్చని ఆర్థిక శాఖ ప్రకటించడం విదితమే.

స్ట్రీట్ వెండర్స్ వివరాలు

మున్సిపాలిటీ	స్ట్రీట్ వెండర్స్
తాండూరు	3,118
పరిగి	813
కొడంగల్	681
వికారాబాద్	2,874
మొత్తం	7,486

మండల కేంద్రం ఏర్పాటుకు పోరాడుదాం

» జేఏసీ నాయకులు

తలకొండపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదించిన 11 కొత్త మండలాల జాబితాలో గట్టిప్పలపల్లి పేరు లేకపోతే దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 97వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల వరకు మండల కేంద్రంగా ప్రకటించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని చెప్పారు. ఆమేరకు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్లు అంజనేయులుగౌడ్, శరత్‌చంద్ర, కార్యదర్శి అనిల్ ఉన్నారు.



ఆచారికి వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

కవులకు ఆహ్వానం



వడిచర్ల సత్యం



కోటం చంద్రశేఖర్

తాండూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాహిత్య అకాడమీ నుంచి తాండూరు కవులకు ఆహ్వానం అందింది. ఈ నెల 8, 9న ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తున్న సాహిత్య, సంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనాలని కవులు కోటం చంద్రశేఖర్, వడచర్ల సత్యంలను ఆహ్వానించారు. కవులకు ఆహ్వానించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులతో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో సుశీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్‌లో..

మోమిన్‌పేట్: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తన కార్యాలయంలో బుధవారం ఆమె పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమావేశం నిర్వహించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా ఉపాధిహామీ నర్సరీల్లో మొక్కలను పెంచి రాబోయే వర్షాకాలానికి నాటేందుకు సిద్ధం చేయాలని ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో యాదగిరి, ఏపీవో శంకరయ్య పంచాయతీ కార్యదర్శులు నర్సింహులు, సుగుణ పాల్గొన్నారు.

ఆగాఖాన్ ఫౌండేషన్‌కు పునాది ఇక్కడే..

మహేశ్వరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆగాఖాన్ అంతర్జాతీయ విద్యాసంస్థల అధినేత కరీం అల్ హుస్సేనీ ఆగాఖాన్(88) బుధవారం పోర్చుగల్‌లో కన్నుమూశారు. మహేశ్వరం మండలం రావిర్యాల రెవెన్యూ పరిధిలోని 100 ఎకరాల విస్తీర్ణంలో 2006లో అగాఖాన్ ఫౌండేషన్ అంతర్జాతీయ విద్యాసంస్థకు పునాదుల వేశారు. 2010లో 1 నుంచి 12 వ తరగతి వరకు విద్యాసంస్థను ప్రారంభించి అంచెలంచెలుగా అభివృద్ధి చేసి ఎంతో మంది విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలకు ఎదిగేలా మార్గనిర్దేశం చేశారు. అలాగే ఆయన ఆలోచన ఆధ్యాత్మిక విశ్వాసం, మానవజాతి గౌరవాన్ని నిలిపే విధి విధానాలవైపు ఎక్కువగా ఉండేవి. ఆయన ప్రపంచంలో అభివృద్ధి చెందని కొన్ని ప్రాంతాలలోని కమ్యూనిటీలకు సేవలందించే విధంగా ప్రపంచంలో అతి పెద్ద ప్రైవేట్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ స్థాపించి అనేక మంది పేదలకు అభివృద్ధి, మార్గనిర్దేశం చేసేవారు. అంతే కాకుండా శాంతి, మానవ పురోగతికి రాజనీతిజ్ఞుడుగా, రక్షకుడిగా ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. ఆయన మృతి పట్ల ఆగాఖాన్ ఫౌండేషన్ దుఃఖసాగరంలో మునిగింది.

డీసీఎంఎస్ దుకాణ సముదాయం ప్రారంభం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాల్మాకులలో జిల్లా నూతన సహకార మార్కెటింగ్ సొసైటీ దుకాణ సముదాయాన్ని డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. రైతులకు ఏ ప్రభుత్వం ఇవ్వని సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మల్కారం పీఎస్‌సీఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్, చిన్నగోల్కొండ పీఎస్‌సీఎస్ చైర్మన్ దౌనకర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు, మాజీ ఎంపీటీసీలు సరితరవీందర్, ఇందిరకృష్ణాగౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుధీశ్వర్‌గౌడ్, చక్రధర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనేగోని శ్రీకాంత్‌గౌడ్, కోటేష్‌గౌడ్, నరసింహ, జుర్కి రమేష్ పటేల్, శబరి, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

» సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం బండంగ్‌పేట్‌లోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన సంస్థ సర్వసభ్య సమావేశంలో బడ్జెట్ అంశాలపై చర్చించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు చేసిన ఖర్చులను ఆమోదించారు. జిల్లా పరిధిలోని మొయినాబాద్, గండిపేట, అబ్దుల్లాపూర్‌మెట్, కడ్తాలలోపాటు పలు ప్రాంతాల్లోని గ్రంథాలయాల భవన నిర్మాణాల కోసం రూ. 10 కోట్లు సంస్థ కేటాయించిందన్నారు. అలాగే కొత్తగా పుస్తకాలు కొనుగోలు చేసేందుకు రూ.50 లక్షలు, కొత్తగా ఫర్నిచర్ కొనుగోలుకు రూ.50 లక్షలు అంచనా వేసినట్లు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల ఖర్చు కింద రూ. 5 లక్షలు కేటాయించేందుకు ఆమోదించారు. కార్యక్రమంలో డీఈఓ సుశీందర్ రావు, డీపీఆర్వో పీసీ వెంకటేశం, వయోజన విద్యాధికారి అనిత, పంచాయతీ అధికారి సాధన, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి

కడ్తాల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయులు రాజేంద్రనగర్ ఎస్ఈ శ్రీరామ్ మోహన్‌ను కోరారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుపోయి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామరాజేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసు రవి, భానుకిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాంక్రీట్ మిషన్‌తో ఇబ్బందులు

శంషాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్వాల్ గూడ పరిధిలో ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన కొందరు ప్రైవేట్ భూములు లీజుకు తీసుకొని ఏళ్లుగా కాంక్రీట్ మిషన్ పెట్టడంతో ఇబ్బందులు తప్పడం లేదని సీపీఐ నాయకులు అన్నారు. ఈమేరకు బుధవారం రంగారెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. కాంక్రీట్ మిషన్‌తో సమీప పొలాల్లో దుమ్ము చేరి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

తలకొండపల్లి పంచాయతీ అధికారిగా లక్‌పతినాయక్

తలకొండపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మండల పంచాయతీ అధికారిగా లక్‌పతినాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపీవో ఇబ్రహీంపట్నంకు బదిలీపై వెళ్లారు. అక్కడ పని చేస్తున్న లక్‌పతినాయక్ తలకొండపల్లికి బదిలీపై వచ్చారు.

మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి

షాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే పెద్ద మార్కెట్ అయిన సర్దార్‌నగర్ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీబాయి అన్నారు. బుధవారం నగరంలోని మార్కెటింగ్ కార్యాలయంలో సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి మొహమ్మద్ రియాజ్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన పెద్దయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చాడు. రూ. 3 వేలు తక్షణసాయం అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి రూ.4 వేలు, అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాములు, నాయకులు సురేందర్, రవి, శంకర్, వెంకట్ రెడ్డి, శ్రీనివాసులు, మహేశ్, విష్ణు, జంగయ్య, శంకరయ్య, కిరణ్, రాములు, యాదయ్య, కృష్ణయ్య, నర్సింహులు ఉన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

యాచారం. ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆకుల మైలారంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం శ్రీఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలకు, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలనానరు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై తేజం రెడ్డి ఉన్నారు.

ఫస్ట్‌ఎయిడ్ కిట్లు ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందించాలని ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రాధికకు పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు గాయాలైతే వెంటనే ఫస్ట్‌ఎయిడ్ చేయాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని కిట్లు అందించాలన్నారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేష్, రాజు, హరిప్రసాద్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ ముందంజ

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నేతల క్షీరాభిషేకం


కడ్తాల్: రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికను క్యాబినెట్, అసెంబ్లీ, శాసన మండలిలో ప్రవేశపెట్టి ఆమోదించడాన్ని హర్షిస్తూ కడ్తాలలో బుధవారం పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో దేశంలో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ ముందుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణ విషయంలో చిత్తశుద్ధితో ఉన్నారని పేర్కొన్నారు. అంతకుముందుకు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, నాయకులు రామకృష్ణ, లక్ష్మయ్య, శంకర్, సిలారి, హన్మనాయక్, పర్వతాలు, జహంగీర్‌అలీ, మంకి శ్రీను, కాలే వెంకటేశ్, దాసు, నర్సింహ, మహేశ్, శ్రీను, రమేశ్, శ్రీకాంత్, మోత్యనాయక్, శివరాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మాడ్గుల: మాదిగల రిజర్వేషన్ పోరాట సమితీ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగా అసంబ్లీలో తీర్మానం చేయడం సంతోషకరమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మాదిగలకు కోటాను 9 శాతం, మాలలకు 5, ఇతరులకు ఒక్క శాతం బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించిన సందర్భంగా మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అన్నెపాక జంగయ్య, ఏర్పుల బుక్కయ్య, జింకల భాస్కర్, అన్నెపాక విజయకుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్


మాట్లాడుతున్న రమేష్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి

యాచారం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో జనాలను మోసం చేయడంలో కాంగ్రెస్ పాలకులు దిట్ట అని, కనీసం సామాజిక పింఛన్లను కూడా పెంచలేకపోతున్నారని బీఆర్ఎస్ యాచారం మండల అధ్యక్ష కార్యదర్శులు రమేష్‌గౌడ్, భాషా, మండల సొసైటీ చైర్మన్ రాజేందర్ రెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 420 హామీలు ఇచ్చి ఏ ఒక్క దానిని అమలు చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఇష్టారాజ్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ఇదిగో.. అదిగో రైతు భరోసా అంటూ రైతులను మోసం చేయడం తప్ప ఏం చేయలేదని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మండల ప్రజల సమస్యలను పరిష్కరించలేకపోతున్నారన్నారు. కులగణన పూర్తయినా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. దివ్యాంగులకు నెలకు రూ.6వేల పింఛన్ ఇస్తామని మాట తప్పారన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఆందోళనలు చేస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు నర్సింహారెడ్డి, ఎండీ ఖాజుద్దీన్, యాదయ్యగౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ కారింగ్‌యాదయ్య, గోపాల్, ఎండీ హబీబుద్దీన్ ఉన్నారు.

ఎస్సైల బదిలీలు

చేవెళ్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పరిధిలో ఎస్సైలు బదిలీ అయ్యారు. శిక్షణ పూర్తి చేసుకుని ఇటీవల విధుల్లో చేరిన 2024 బ్యాచ్‌కు చెందిన ఎస్సైలకు ఉన్నతాధికారులు స్థానచలనం కల్పించారు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శిరీష చేవెళ్లకు, చేవెళ్లలో పని చేస్తున్న ఎస్సై జాబీనా మొయినాబాద్‌కు బదిలీ అయ్యారు. షాద్‌నగర్ నుంచి షాబాద్‌కు ఎస్సైగా దేవకి, శంకర్‌పలి నుంచి ఎస్సై సత్యనారాయణ కూకట్‌పల్లికి, అల్వాల్ నుంచి బీటీప్ప శంకర్‌పల్లికి, బాలనగర్ నుంచి సుభాష్ మొయినాబాద్‌కు బదిలీ అయ్యారు. ఎస్సై శిరీష బుధవారం సాయంత్రం చేవెళ్ల ఎస్సైగా బాధ్యతలు చేపట్టారని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు.

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సై బలరాంనాయక్ మాదాపూర్‌కు బదిలీ కాగా ఎస్సై దేవకి షాబాద్‌కు బదిలీ అయ్యారు. ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్ కొందుర్గు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అక్కడ పని చేస్తున్న కృష్ణయ్య షాద్‌నగర్‌కు బదిలీ అయ్యారు.

చౌదరిగూడ: కొందుర్గు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా రవీందర్ నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కొందుర్గు ఎస్ఐ కృష్ణయ్య షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లనున్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైకి సన్మానం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీఐ ఎస్సైగా విధులు నిర్వహించిన రాంచంద్రయ్య గత నెల 31న ఉద్యోగ విరమణ పొందారు. శంషాబాద్ జోన్ డీసీపీ రాజేశ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయనను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన రాంచంద్రయ్య విధి నిర్వాహణలో నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ, సీఐలు బాల్‌రాజ్, నరేందర్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన ఏఎస్ఐకి..

ఆమనగల్లు: ఏఎస్ఐ నుంచి ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందిన యాదయ్యకు బుధవారం బీఆర్ఎస్ నాయకులు అభినందన కార్యక్రమం నిర్వహించారు. పోలీసుస్టేషన్‌లో యాదయ్యను సన్మానించారు. విధి నిర్వాహణలో అంకితభావంతో పనిచేసిన యాదయ్య స్థానికంగా ప్రజల అభిమానం చూరగొన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనునాయక్, కడారి యాదయ్య, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ అందజేత

కొత్తూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెంజర్ల గ్రామానికి చెందిన స్వర్గీయ మామిడి సత్యనారాయణరెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు మామిడి భీంరెడ్డి బుధవారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు మోడల్ పేపర్లు, స్టేషనరీ అందించారు. విద్యార్థులకు వైద్యులతో సీపీఆర్‌పై అవగాహన కల్పించి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సీపీఆర్ రాష్ట్ర కోఆర్డినేటర్, హెలియాస్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ విజయ్‌భాస్కర్‌గౌడ్, రిటైర్డ్ జడ్జి నేరెళ్ల మాల్యాద్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజ, రెడ్‌క్రాస్‌కు చెందిన జ్యోతి, ప్రసన్నరాణి, రవికుమార్, బీజేపీ నాయకుడు మహేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

చేవెళ్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనం నడిపితే చర్యలు తప్పవని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వాహనాదారులకు అవగాహన కల్పించారు. చేవెళ్లలో వాహనాలు తనిఖీ చేస్తే 12 మంది మైనర్లు పట్టుబడ్డారని చెప్పారు. ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మంచాల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరుట్లలో ఈ నెల 9 నుంచి వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేశ్ బుధవారం తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ యాదయ్య, మాసయ్యగౌడ్, రాములు, చంద్రయ్య, సురేశ్, అంతటిరాజు, వెంకటేశ్, సురేశ్, కుమార్, ఐలయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ఆనందమయ జీవనం

తలకొండపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతో ముందుకు సాగే వారు ఒత్తిళ్లను జయించి ఆనందమయ జీవనం సాగిస్తారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌యాదవ్‌ను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కట్టుమల్ల మధు, నర్సింహ, బాల్‌రాజ్, నర్సింహ, కటికల మధు, యాదయ్య, రమేశ్, నర్సింహ, శ్రీను, చెన్నయ్య పాల్గొన్నారు.

కనులపండువగా బ్రహ్మోత్సవాలు


పూజలు చేస్తున్న గోదాదేవి సత్యం, నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కనుపండువగా కొనసాగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద నిర్వాహకులు అన్ని వసతులు కల్పించారు. బుధవారం చక్రతీర్థం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్, అర్చకులు గూడ కృష్ణమాచార్యులు, నాయకులు భాస్కర్‌రావు, వెంకటయ్య, శ్రీను, యాదయ్య పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

కడ్తాల్: మక్తమాదారం వేణుగోపాలస్వామి ఆలయ రథోత్సవం బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శోభాయమానంగా అలంకరించిన రథంపై దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాలను ఉంచి తాళ్లతో లాగి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయంలో ఆలయ ధర్మకర్త, అర్చకులు వింజమూరి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, మాజీ ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు నర్సింహ, బాల్‌రాజ్, చెన్నయ్య, రామకృష్ణ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఆమనగల్లు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరంగా నిలుస్తుందని బీఆర్ఎస్ నాయకులు గొర్రె పవన్ కుమార్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి అన్నారు. మాడ్గుల మండలం కలకొండ గ్రామానికి చెందిన రాములు రూ. 25 వేలు, బాలమణికి రూ.28 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో ఈ చెక్కులను బుధవారం హైదరాబాద్‌లోని గోలి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఐజాక్, వీరేశ్, తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల: మండలంలోని కలకొండ గ్రామానికి చెందిన డొంకి రాములు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకొన్నారు. ఆస్పత్రీ ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ఫుడ్స్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎస్ రూ.28 వేల చెక్కును బాధితుడికి సింగల్ విండో డైరెక్టర్ రాజవర్ధన్ రెడ్డి, కలకొండ మాజీ సర్పంచ్ పవన్‌కుమార్‌రెడ్డి అందచేశారు. కార్యక్రమంలో వీరేషమ్, ఐజాక్ పాల్గొన్నారు.

రేపటి నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ గ్రామంలోని స్వర్ణభారతి ట్రస్టు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా టైలరింగ్ శిక్షణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉమెన్స్ టైలరింగ్‌కు సంబంధించి 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తామని బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉండి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 7 నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందని చెప్పారు. శిక్షణలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7893121143 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ విద్యార్థులకు రెసిడెన్షియల్ క్యాంపు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన సరస్వతీ ఫౌండేషన్ - సాక్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం సమీపంలోని సాధన కుటీర్‌లో క్రీడలు, అకాడమిక్, కల్చరల్, విభాగాల్లో ఎంపికైన విద్యార్థులకు ఉచితంగా రెసిడెన్షియల్ క్యాంపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సదా వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 11న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాధన కుటీర్‌లో ఈ ఎంపిక కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, యోగా, పెయింటింగ్, అంశాల్లో ప్రతి ప్రభుత్వ పాఠశాల నుంచి ఏడో తరగతి చదువుతున్న బాలురకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థికి ఇష్టమైన అంశంలో సెలవు రోజుల్లో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసకిగల విద్యార్థులు గురువారం సాయంత్రం వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 97040 38738, 95500 93423 నంబర్లలతో సంప్రదించాలని కోరారు.

'ప్రజలను మోసం చేస్తున్న కేఎల్లార్'

మహేశ్వరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు తెల్లమల్ల యాదీశ్ ఆరోపించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మహేశ్వరం అభివృద్ధిపై అవగాహన లేకుండా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క రోజైనా గ్రామాలను సందర్శించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారా అని ప్రశ్నించారు. చేసిన పనులకు బిల్లులు రాక అప్పులపాలైన మాజీ సర్పంచ్‌లు అప్పులపాలయ్యారన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దపీట


కందుకూరు: ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణకు పెద్దపీట వేసిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ నేతలతో కలిసి మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో జాతీయ రహదారులకు, రైతుల సంక్షేమానికి అధికంగా నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో చిరు వ్యాపారులను ప్రోత్సహిస్తూ.. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు గౌరవంగా బతికేవిధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బక్క మల్లేశ్, ప్రభాకర్, అంబటి యాదగిరి, చెన్నారెడ్డి, కృష్ణగౌడ్, కుమార్, అంబటి కృష్ణ, ప్రవీణ్, దయాకర్‌రెడ్డి, మల్లేష్, శ్రీశైలం, ఆంజనేయులు, నరసింహ, శ్రీనివాస్‌నాయక్, రాజునాయక్, నరేందర్, అనంత్, మహేష్ పాల్గొన్నారు.

మంచాల: అట్టడుగువర్గాలకు మేలు జరిగేలా కేంద్ర బడ్జెట్ ఉందని మాజీ వైస్‌ఎంపీపీ దన్నె భాషయ్య అన్నారు. మంచాల బస్టాండ్ చౌరస్తాలో పార్టీ నేతలతో కలిసి ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నూకం రాజు, ప్రకాష్, చివరాల పాండు, నరేందర్‌గౌడ్, దండేటికార్ విజయ్, గొరైపాటి వినోద్, సురేష్, పూర్ణచందర్, ప్రసాద్‌రెడ్డి, పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: పేద, ఉద్యోగ, బడుగు, వర్గాలకు కేంద్ర బడ్జెట్ నిధులు కేటాయించిందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల అధ్యక్షుడు మాణయ్య ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కాంగ్రెస్ వాళ్లు ఓర్వలేక విమర్శిస్తున్నారని ఆరోపించారు. వచ్చే స్థానిక పోరుకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కంజర్ల ప్రకాష్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కిరణ్, మహేష్, గోవర్దన్, విఠల్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్యాంకర్‌ను ఢీకొట్టిన బైక్.. వ్యక్తి మృతి


రాజునాయక్(ఫైల్)

కేశంపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కంకరాళ్ల తండాకు చెందిన వంక్టవత్ రాజు నాయక్(41) బుధవారం బైక్‌పై వేముల్‌నర్వ - ఎక్లాస్‌ఖాన్‌పేట రోడ్డులో తండాకు వెళ్తుండగా కొమ్మటి చెరువు వద్ద రోడ్డుపై ఆగిఉన్న వాటర్ ట్యాంకర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజు నాయక్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థి గాయాలతో చికిత్స పొందుతున్నాడు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయి కళాశాలలో కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం చదవుతున్న శ్రీహర్ష(19), హర్షనందన్ వేదాంతం ఇరువురు స్నేహితులు. వీరు మోకిలతండాలో అద్దెకుంటున్నారు. శ్రీహర్ష, హర్షనందన్ వేదాంతం బుధవారం సాయంత్రం బైకుపై మోకిలకు వస్తుండగా, కొండాకల్ వైపు వెళ్తున్న ఏపీ మోడల్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన శ్రీహర్ష అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రగాయాలైన హర్షనందన్ వేదాంతంను స్థానికులు, పోలీసులు శంకర్‌పల్లిలోని లలిత ఆస్పత్రికి తరలించారు.

మొండిగౌరెల్లిలో మహిళ అదృశ్యం


భాగ్యమ్మ

యాచారం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బట్టలు తెస్తానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన పుప్పల భాగ్యమ్మ, శ్రీను దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన భాగ్యమ్మ ఇంటికి రాలేదు. దీంతో ఆమె భర్త కుమార్తెలు రెండు రోజులపాటు ఎంత వెతికినా జాడ దొరకలేదు. బుధవారం భర్త శ్రీను యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహరావు తెలిపారు.

1.5 కిలోల గంజాయి పట్టివేత

ఆదిభట్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజోతి): నిషేధిత గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఏస్వోటీ, ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. టాటా ఏరోస్పేస్ సమీపంలో ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయా సమాచారం రావడంతో ఎస్సై వెంకటేష్, మహేశ్వరం ఏస్వోటీ పోలీసులు అక్కడికి చేరుకొని గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద 1.5 కేజీల గంజాయి దొరికింది. దాని విలువ రూ.37 వేలు ఉంటుందని, నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా ఆదిభట్ల సమీపంలోని కంపెనీల్లో, భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. గంజాయి విక్రయిస్తుండగా పట్టుబడ్డ ఆనంద్‌కుమార్ శర్మ(29), అవినాష్ యాదవ్(20)లను రిమాండ్ తరలించారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

మాడ్గుల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్కులపల్లి గ్రామానికి చెందిన పోలే యాదయ్య(55) మనస్తాపానికి గురై బుధవారం పురుగుల మందు తాగాడని సీఐ వేణుగోపాల్ తెలిపారు. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలోని ఇరిగేషన్ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న యాదయ్య మంగళవారం విధులు ముగించుకొని తిరిగి ఇంటికి వచ్చాడు. తర్వాత పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు వెంటనే ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాచులూరు పాఠశాలకు ర్యాకులు అందజేత

కందుకూరు, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): మండంలోని రాచులూరు ఉన్నత పాఠశాలకు రూ.30వేల విలువగల ర్యాకులను ఆ గ్రామ కెనరా బ్యాంకు మేనేజర్ కర్ణాకర్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజసేవలో భాగంగా తమ బ్యాంకు విద్యార్థుల అవసరాల మేరకు ర్యాకులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ అక్షయమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందని 'గౌరవం'

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా గౌరవ వేతనం పెంపు ఊసే లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ బియ్యం పంపిణీ ఇలా..

జిల్లాలో మొత్తం 936 రేషన్ షాపులు ఉండగా, వీటి ద్వారా 11,559.197 మెట్రిక్ టన్నుల బియ్యం పేదలకు పంపిణీ చేస్తున్నారు. అలాగే అర్బన్‌ప్రాంతాల్లో 218 దుకాణాలుండగా 4192.799మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 33,481 అంత్యోదయ కార్డుల ద్వారా 91317 మెట్రిక్ టన్నులు, 5,24,890 ఆహార భద్రత కార్డుల ద్వారా 17,31,162 మెట్రిక్ టన్నుల బియ్యం, 39 అన్నపూర్ణ కార్డుల ద్వారా 53 క్వింటాళ్ల బియ్యం ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. కాగా ఇటీవల ప్రజాపాలన గ్రామసభలలో రేషన్ కార్డులను పంపిణీ చేసింది. వాటికి బియ్యం కేటాయించలేదని డీలర్లు చెప్పారు. రేషన్‌కార్డుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని డీలర్లు, రెవెన్యూ అధికారులు తెలిపారు.


ఇతర సరుకులు అమ్మితే కొంత లాభం ఉండేది..

గతంలో రేషన్ దుకాణాలలో బియ్యంతో పాటు చక్కర, ఉప్పు, వంట నూనె, ఇతర సరుకులు విక్రయించేవారు. వాటి అమ్మకాలతో డీలర్లకు కొంత లాభం చేకూరేది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమ్మహస్తం నిలిపివేసింది. దాంతోనే కష్టాలు మొదలైనట్లు డీలర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా గౌరవ వేతనం పెంచి, నెలనెలా పెండింగ్ లేకుండా అందివ్వాలని డీలర్లు కోరుతున్నారు.

డిమాండ్లు ఇవి..

కాంగ్రెస్ ప్రభుత్వం పెంచుతానన్న కమీషన్ పెంచాలని డీలర్లు కోరుతున్నారు. లారీ అన్‌లోడింగ్ ఖర్చు భరించాల్సి రావడంతో ఏం మిగలడంలేదని చెబుతున్నారు. అలాగే రేషన్ దుకాణ నిర్వహణ కోసం భవానికి అద్దె, హమాలీల ఖర్చులు, విద్యుత్ చార్జీలకు తడిసి మోపెడవుతుందని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ఖర్చంతా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోరుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రేషన్ దుకాణాలకు పక్కా భవనాలు నిర్మించాలంటున్నారు. అలాగే దుకాణాల లైసెన్సు రిన్యూవల్‌ను పాత నిబంధనల ప్రకారం చేయాలని డీలర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు



రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బు పెంచే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది, మా చేతిలో ఏం లేదు. ప్రతి గ్రామంలో ప్రజలకు సక్రమంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. వారిపై ఎలాంటి పిర్యాదులు రావడం లేదు. వారికున్న ఇబ్బందులు తీర్చడం మా చేతిలో లేదు. రాష్ట్ర ప్రభుత్వం వీరి ఇబ్బందులు తీరుస్తుందని బావిస్తున్నాం, ప్రతి కుటుంబానికి సక్రమంగా బియ్యం అందిస్తున్నారు.

- అయ్యప్ప, యాచారం తహసీల్దార్